# అంతస్తు - ఆత్మీయత

రమాకాంత్, ఆఫీసులో అడుగు పెట్టగానే, గుమాస్తా శంకరం ఒక టెలిగ్రామ్ అందించి పోయాడు. టెలిగ్రామ్ చూడగానే, అతనికి గాభరా పుట్టింది ఆత్రుతగా కవరు చించి చదివాడు అశుభం యేమీ అందులో లేకపోవడంతో తృప్తిగా నిట్టూర్చి, స్నేహితుడు సుందరం వస్తున్నట్లు ఆ టెలిగ్రాములో చదువుకుని, ఎంతగానో మురిసిపోయాడు. కొన్ని సంవత్సరాల తర్వాత, తామిద్దరూ కలుసుకుంటున్నందుకు అమితానందాన్ని పొందాడు. గతాన్ని నెమరు వేసుకుంటూ, యేవేవో మధురానుభూతుల్ని పొందాడు రమాకాంత్.

తొమ్మిది గంటలు కొట్టింది గడియారం. మరోగంటలో మెయిలు వస్తుంది. సరిగ్గా అదే వేళకి రమాకాంత్ పొరుగూరిలో వుంటాడు. వ్యాపారరీత్యా అక్కడికి వెళ్ళాలి అతను. ఏం చేయడమా అన్న ఆలోచనతో సతమతమయ్యాడు. ఎంత ఆలోచించినా, తన ప్రయాణం ఆపుకోవడం సమంజసం కాదనిపించింది. ఒకే ఒక్క మార్గం అగుపించింది.

తన పరిస్థితి చెప్పుకుని క్షమించమని స్నేహితుణ్ని కోరు కోవచ్చు తర్వాత. ప్రస్తుతానికి శంకరంని స్టేషనుకి పంపించి, స్నేహితుడికి స్వాగతం చెప్పమనడమే, వుత్తమముగా తోచింది.

కాలింగ్ బెల్ కొట్టాడు. బంట్రోతు వచ్చి చేతులు కట్టుకుని వినయంగా నుంచున్నాడు.

"శంకరం గారిని రమ్మని చెప్పు" వుత్తర్వు జారీ చేశాడు.

బంట్రోతు నిష్క్రమించిన కొద్ది క్షణాలకు శంకరం వచ్చాడు.

"పిల్చారా సార్..."

"ఔనోయ్...చూడూ. నా ప్రాణస్నేహితు డొకడు ఇవ్వాళ మెయిల్లో విశాఖపట్నంనుండి వస్తున్నాడు. నేనే స్వయంగా వెళ్ళి, వాణ్ని రిసీవ్ చేసుకునే వాణ్నిగాని, నా ప్రయాణాన్ని యీ క్షణంలో ఆపుకుందుకు వీల్లేక, అది జర గడంలేదు. నువ్వు స్టేషనుకి వెళ్ళి అతణ్ని యెలాగైనా గుర్తు పట్టి, మా యింటికి తీసుకువెళ్ళు. నేను మరో రెండు గంటల్లో తిరిగి వచ్చేస్తాను."

"ఆయన్ని నే నెప్పుడూ చూళ్ళేదుసార్, యెలా గుర్తు పట్టడం?"

"చామన ఛాయలో పొడుగ్గా సన్నగా ఉంటాడోయ్. ఉంగరాల జుత్తు. చప్పున చూస్తే, నాటకాల్లో నటించేవాడిలా

అగుపిస్తాడు. ఎప్పుడూ సిగరెట్ నోట్లో వుంటుంది. ఐతే, యిప్పుడా అలవాటు వుందో లేదో చెప్పలేంలే! ఒక్కడే వస్తున్నాడు గాబట్టి, సులువుగా గుర్తుపట్టగలవు.... శాస్త్ర ప్రయత్నిద్దూ! మరి, నే వెళ్లొస్తా.... వేళయ్యింది." అంటూ బైటికి నడిచాడు. కొద్దిసేపట్లో అతని కారు బుర్రుమంటూ బైలుదేరింది.

వెనుక సీట్లో కూచున్న రమాకాంత్ ఆలోచనలు, కారుకంటె వేగంగా పరుగెత్తుతున్నయ్, గతానుభవాలన్నీ స్మృతిపథానికి వస్తున్నాయి. మళ్ళీ చాలా రోజులకు స్నేహితుణ్ని చూడగలుగుతున్నానన్న ఆనందం, అతనిలో వురకలు వేసింది. స్నేహితుడు సోమసుందరం యిప్పుడు యెలా వుండి వుంటాడోనని వూహించడానికి ప్రయత్నిస్తున్నాడు. వాడిలో యెటువంటి మార్పులు వచ్చి వుంటాయో! తనని, తన అంతస్తుని చూసి యెంతగా మురిసిపోతాడో! ఇలా సాగాయి అతని ఆలోచనలు.

*  *  *

మెయిల్, రైట్ టైముకే వచ్చింది. ప్లాటుఫారమ్ రకరకాల మనుషులతో కళకళ లాడుతోంది. అంతమంది లోనూ, తన యజమాని స్నేహితుణ్ని యెలా గుర్తుపట్టడమో, శంకరం వూహాకి అందడంలే. ఒంటరిగా వున్న ప్రతి వ్యక్తిని పరిశీలనగా చూడసాగాడు. కాని, రమాకాంత్ చెప్పిన పోలికలు గల వ్యక్తి మాత్రం; అతనికి తారసపడలేదు

ఒక ప్రక్క నిరుత్సాహం, మరో ప్రక్క విసుగూ జనించా యతనిలో.

జనసమ్మర్ధం తగ్గింది. రైలు కూత పెట్టి కదిలింది. గార్డు పచ్చజెండా గాలిలో ఎగురుతూ, శంకరం కళ్ళముందుగానే సాగిపోయింది. శంకరం నిస్పృహతో నిట్టూర్పువిడిచి, భారంగా వెనక్కి తిరిగాడు. యజమాని ఏమనుకుంటాడోనన్న భయం కూడా పట్టుకు బాధించింది కాని, తను మాత్రం యేం చెయ్య గలడు?

గేటుదాటి, యివతలకివచ్చాడు శంకరం. రిక్షావాడితో ఒక వ్యక్తి యేదో మాట్లాడుతూ అగుపించాడు. అతనిలో రమాకాంత్ చెప్పిన పోలికలన్నీ, సుస్పష్టంగా కనిపించాయి. కొడిగట్టిన ఆశాజ్యోతి ప్రజ్వరిల్లింది. అమితోత్సాహంతో అక్కడికి వెళ్ళాడు.

"క్షమించాలిసార్! మీ పేరు సోమసుందరంగారేనా?" సవినయంగా ప్రశ్నించాడు.

"ఔను. ఏం?" ఎదురు ప్రశ్న వేశాడతను కొత్త మొహంలోకి చూస్తూ.

"రమాకాంత్ గారి ఇంటికేనా తమరు వచ్చారు?"

"ఔను" మరీ వింతగా చూశాడు.

శంకరం ఆనందం వర్ణనాతీతం. "నమస్కారం సార్! రమాకాంత్ గారి ఆఫీసులో పనిచేసే ఓ గుమాస్తాని. ఆయన

గారు అత్యవసర కార్యంమీద, పొరుగూరు వెళ్ళారు. తమర్ని వారింటికి తీసుకెళ్ళమని నన్ను పంపించారు....పదండి."

సోమసుందరం మనస్సు చివుక్కుమంది. గుండెల్లో చిన్న చిన్న సూదులు గుచ్చినట్టయ్యింది. స్నేహితుడే స్వయంగా వచ్చి, తనని రిసీవ్ చేసుకుంటాడని, ఎంతో ఆశిం చాడు. కాని, అలా జరక్కుండా గుమస్తాని పంపడం బాధా కరమయ్యింది. 'ఆర్థికంగా అంతస్తు రాగానే, ఆత్మీయతనీ, స్నేహాన్నీ యెందుకు కొందరు మర్చిపోతారో....' అని మన సులో అనుకోకుండా వుండలేక పోయాడు.

"కూర్చోండి సార్! యింటికి పోదాం...." అంటూ సోమసుందరం చేతిలోని బేగ్ అందుకుని, అతని ఆలోచనలకు యెక్కువ అవకాశాన్నివ్వలేదు.

సోమసుందరం, యాంత్రికంగా రిక్షాలో కూర్చు న్నాడు. అతని మెదడులో యెన్నో ఆలోచనలు వున్నా, ఇంకేమీ అనలేక పోయాడు. శంకరం అతని ప్రక్కనే కూచుని రిక్షాని పోనివ్వమన్నాడు.

రమాకాంత్ యింటిముందు రిక్షా ఆగింది. సోమ సుందరం రిక్షావాడికి డబ్బులిచ్చేసి, యింటివేపు ఓ సారి పరి శీలనగా చూశాడు. ఇల్లు చాలా బావుంది. 'మంచి యిల్లే కట్టించుకున్నాడు.' అనుకున్నాడు అంతరంగంలో.

శంకరం లోపలికి వెళ్తూ "రండి సార్" అని ఆహ్వా నించాడు. సోమసుందరం అతణ్ని అనుసరించాడు.

బాహ్యంగా యెంత అందంగా ఆ యిల్లు అగుపించిందో, లోపలకూడా అంత రమణీయంగానే వుంది. విశాలంగా వున్న డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చారు.

"ఇక్కడ కాస్సేపు విశ్రాంతి తీసుకోండి సార్!" అంటూ లోపలికి నడిచాడు శంకరం.

సోమసుందరం సోఫాలో కూచున్నాడు చుట్టూ ఓ సారి కలయజూశాడు. గది అధునాతన రీతుల్లో అలంకరించ బడి వుంది. 'మానవ జన్మ యెత్తాక, శ్రీమంతుల యింట్లోనే జన్మించాలి...' అన్న ఆలోచన ఆతని మెదడులో అప్రయత్నంగా మెదిలిందంటే ఆశ్చర్యం లేదు.

"నాకు శలవిప్పించండి సార్! బాబుగారు మరికొద్ది సేపట్లోనే వచ్చేస్తారు. అమ్మగారితో చెప్పాను— స్నానాదిక యేర్పాటు చేయిస్తారు లెండి." సవినయంగా అంటూ నిష్క్రమించాడు శంకరం.

సోమసుందరంకి ఏమిటో అదోలా అనిపించింది. ఎంతో వుత్సాహంతో వచ్చినవాడు, దిగులుతో డీలా అయిపో యాడు ఒంటరిగ కూచోవడం, మరీ బాధాకరంగా తోచింది.

ఇంతలో నౌకరు కాఫీ తెచ్చియిచ్చాడు సోమసుందరం కాఫీ తీసుకుంటున్నాడు.

"ఒరేయ్ సూరయ్యా, ఆ బాబు స్నానం చేస్తారేమో కనుక్కో. మీ బాబుగారికి ప్రపంచంలో వున్న వాళ్ళంతా స్నేహితులే!" అన్న స్త్రీ కంఠం వినిపించింది. కాఫీ ద్రవ

పదార్థమైనా, గొంతునుండి దిగలేదు సోమసుందరంకి. కాఫీ కప్పు అలా అక్కడ పెట్టేశాడు.

అతని మనస్సు యెంతగానో గాయపడింది. స్నేహితుణ్ణి చూడాలన్న కాంక్షతో వచ్చిన తను అన్ని విధాలా అవమానమే పొందాడు: నిజంగా తను దురదృష్టవంతుడే.

"ఇప్పుడు నేను స్నానం చెయ్యాలోయ్..." అన్నాడు బొంగురుపోయిన గొంతుతో.

సోమసుందరం బుర్రలో రైళ్ళు కూ కొంటున్నాయి. నెత్తిమీద ఫాను తిరుగుతూ వున్నా, ముచ్చెమటలుపోశాయి శరీరమంతా. ఇంక అక్కడ వుండడానికి మనస్కరించలేదు. శ్రీమంతులు, స్నేహితులుగా వుంటే ఒక్కొక్కప్పుడు యిటువంటి సంఘటనలే యెదుర్కోవల్సి వస్తుందేమోనని అనుకోకండా వుండలేకపోయాడు. లేచి నుంచున్నాడు. బేగ్ని చేతిలోకి తీసుకుని; చుట్టూ ఓసారి కలయజూశాడు. ఎవ్వరూ లేరు. రెండడుగులు వేశాడు. "స్నేహితుణ్ని కలుసుకోవాలని ఇంత దూరమూ వచ్చి అతణ్ని కలుసుకోకుండానే వెళ్ళిపోవడం యేం బావుంటుంది?" అంది అంతరాత్మ. తక్కున ఆగిపోయాడు. "ఇంటావిడ అలా అవమానించినా, వుండడానికి నీకు యెట్లా మనసొప్పుతుంది?".... అంది ఆత్మ.

ఈ సంఘర్షణలో క్షణంసేపు సతమతమైపోయాడు. ఆత్మ గెలిచింది, ఉపేక్షించకుండా, చరచరా బైటికి నడిచాడు. నేరుగా స్టేషనుకే దారితీశాడు. అతని హృదయం అవ్యక్తంగా బావురుమంది. ఓ పక్క ఆకలి,

మరోపక్క దాహం పీడిస్తున్నాయి స్టేషను ప్లాట్‌ఫారమ్ మీదున్న 'టీ స్టాల్'లో టిఫినూ, కాఫీ తీసుకుని, కొంత తాఫీపడ్డాడు. అక్కడే సిమ్మెంటు బెంచీమీద కూలబడి సిగరెట్ ముట్టించాడు, సోమసుందరం స్నేహితుణ్ని చూడ లేక పోయానే అన్నబాధ అతణ్ని రగిల్చేస్తోంది. అయినా, యేం చేస్తాడు? అభిమానం అడ్డొచ్చింది.

*　　　*　　　*

పదకొండు కావస్తోంది. ఎండ అట్టే తీవ్రంగా లేదు. రమాకాంతు ఇల్లుచేరుకున్నాడు. ఇంట్లో అడుగు పెడుతూనే,

"సుందరం.... ఒరేయ్ సుందరం." అంటూ వుత్సాహంగా కేకలు వేశాడు.

సోమసుందరం, నవ్వుతూ యెదురుగావస్తాడని వూహించిన రమాకాంత్‌కి, మందస్మిత వదనంతో సరళ యెదురొచ్చింది. షాక్ తిన్నట్టుగా ఫీలయ్యాడు రమాకాంత్,

"ఏవిటండీ ఆ గోల—? అబ్బ..." అంది నవ్వుతూ.

"మా సుందరం యేడీ సరళా?" వింతగా ఆమెకేసి చూస్తూ ఆసక్తిగా అడిగాడు.

సరళ చిన్నగా నవ్వి, నిట్టూర్చింది. తేలిగ్గా "మంచి సుందరమేనండీ కాఫీ పంపాను తీసుకున్నాడు. స్నానం చేస్తారా అని సూరయ్య అడిగితే చెయ్యనన్నాడు, ఇంతా జరి

గారెవరికీ చెప్పకుండా చల్లగా జారుకున్నాడు. ఎల్లాంటి స్నేహితుడో యేమిటోనండీ!" అంది హుషారుగా చేతుల్ని గాలిలోకి విసురుతూ.

రమాకాంత్ నిశ్చేష్టుడయ్యాడు. సోమసుందరం, తనకి ప్రాణప్రదమైన స్నేహితుడు, యెందుకా విధంగా తిరిగి పోయాడో అనూహ్యమయ్యిందతనికి. ఇంత దూరం తనని చూడాలన్న కుతూహలంతో వచ్చినవాడు, చూడకుండా వెళ్ళిపోతాడా? అసంభవం! తను స్టేషనుకి వెళ్ళి రిసీవ్ చేసుకోలేదన్న కోపమా! అయ్యుండదు...ఆ కోపమేవుంటే, యింటి వరకూ యెందుకు వస్తాడు? తనింటి దగ్గిరే వాడికేదో అవమానం జరిగిందేమో!...ఆలోచించిన కొలదట, అదే సంభవమనుకున్నాడు. భార్య సరళ మనస్తత్వం, అతనికి బాగా తెలుసు. ఆమె శ్రీమంతుల బిడ్డ. హోదాగా బ్రతకాలన్న ఆకాంక్ష ఆమెలో బాగా జీర్ణించివుంది. సాధారణ వ్యక్తులతో పరిచయం, ఆమెకి సుతరామూ యిష్టం వుండదు. ఇవన్నీ వూహించిన రమాకాంత్ ఒక నిర్ణయానికి వచ్చాడు.

"నువ్వుగాని ఏమైనా అన్నావా సరళా?" సూటిగా ప్రశ్నించాడు.

"అయ్యో! నే నేమంటానండీ? మంచి చిక్కే!" అమాయకురాలిలా అంది.

"నూరయ్యా." కేకేశాడు రమాకాంత్. అప్పటికే అతనిలో అసహనం స్థావరం యేర్పరుచుకుంది.

కథా నిలయం
శ్రీకాకుళం

సూరయ్య, యజమాని కేక విని పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఇప్పుడొచ్చిన నా స్నేహితుడుయెక్కడికి వెళ్ళాడ్రా?" చిరుకోపంతోనే అడిగాడు.

యజమాని కోపావేశం చూసి కాస్త భయపడ్డాడు సూరయ్య.

"నాకు తెలీదు బాబూ! ఎవరికీ సెప్పకుండానే యెల్లి పోయారు...." వినయంగా అన్నాడు.

"ఇంతకీ, యింటికొచ్చిన మనిషి, తిరిగి వెళ్ళిపోవడ మేమిటి? ఏదో కారణం వుండి వుంటుంది. నువ్వేమయినా అస భ్యంగా ప్రవర్తించావా?" కళ్ళెర్రజేసి అడిగాడు.

సూరయ్య, అడకత్తెర మధ్య పోక చెక్కలా యిరుక్కు న్నాడు. చప్పున జవాబు చెప్పలేక, బెదురు చూపులు చూశాడు.

"చెప్పవేంరా?" గర్జించాడు రమాకాంత్.

"అమ్మగారండీ...మరేమో....మరి " అంటున్నాడే గాని, చెప్పలేక నసుగుతున్నాడు

"అమ్మగారేమన్నారు? చెప్పరా భయంలేదు." —

"మరేమో...ప్రతీవోళ్ళు మీ స్నేహితులేనని విసు క్కున్నారండీ! ఆ మాటకే తాగుతున్న కాఫీ కూడా వదిలేశారు. అప్పుడు నా కర్థంకాలేదండీ! నేను వెళ్ళిన తర్వాత ఎప్పుడు యెళ్ళిపోయారో తెలీదు." సవినయంగా చేతులు

జోడించి, సరళ వేపుకూడా బెదురు చూపులు ప్రదర్శిస్తూ మరీ అన్నాడు సూరయ్య.

రమాకాంత్‌కి పరిస్థితి అవగాహనయ్యింది. భార్యకేసి తీక్ష్ణంగా చూశాడు. ఆ మొహంలో అరుణ రేఖలు దోబూచు లాడుతున్నాయి. సరళమాత్రం నిశ్చలంగా నిల్చుంది.

"నేనేం తప్పుమాట అనలేదండీ! మీ స్నేహితులు, యెంతమంది రావడములేదు?" అంది చెక్కు చెదరకుండా.

రమాకాంత్ నిరుత్సాహంగా నిట్టూర్చాడు. "స్నేహాన్ని గురించి, నువ్వు భావిస్తున్నది యింతేనన్నమాట! ఆ స్నేహానుబంధం, ఆత్మీయతా అట్లాంటివి సరళా! అందుకే యెవరైనా వస్తారు. నేనూ వెళ్తుంటాను. అంతేగాని, మన అంతస్తు చూసి రావడంలేదు. నిజానికి, ఆత్మీయతలేని అంతస్తు లెందుకు చెప్పు? హృదయంలేని హోదా లెందుకు? మనసిచ్చి మనసు పుచ్చుకున్ననాడే, మానవతకు విలువ వుంటుంది. ఆ భావం రానంతవరకూ మనలో మానవత్వం వుందనుకోవడం, వట్టి భ్రమ. నీ ఆధిక్యతనూ, మన స్తత్వాన్ని యింకా మార్చు కోనందుకు చాలా విచారిస్తున్నాను ..." కోపంగా అంటూ చరచరా బైటికి నడిచాడు.

"భోజనంచేసి వెళ్ళండి!" అని సరళ అంటున్నా విని పించుకోలేదు రమాకాంత్. సరళ ఒక్క నిట్టూర్పు విడిచింది.

అమ్మగారేమంటారోనని, సూరయ్య భయకంపితు డయ్యాడు.

"క్షమించండమ్మగారూ! సెప్పడమ్ తప్పిందికాదు...." అన్నాడు మొహం దించుకుని.

అతడు వూహించినట్టుగా, సరళ కోపగించుకోలేదు.

"తప్పు నాదేలే సూరయ్యా. ఆయన హృదయం లాంటి హృదయాన్ని, భగవంతుడు నాకు ప్రసాదించనందుకు, యెంతో బాధపడుతున్నాను" బాధగా అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

ఆపాటి ఆమె అర్థం చేసుకున్నందుకు, సూరయ్య సంతోషించాడు.

స్టేషనుకి వెళ్ళిన రమాకాంత్, ప్లాటుఫారం యీ చివరి నుండి, ఆ చివరివరకూ పరిశీలనగా చూశాడు. మరో అర గంటలో పాసింజరొకటి వుందని అతనికి తెలుసు. అందుకే సోమసుందరం తప్పకుండా స్టేషనుకే వచ్చి వుండాలని అంచనా వేశాడు. కాని, ఎక్కడా అగుపించకపోయేసరికి, బాగా నిరుత్సాహపడ్డాడు. వెయిటింగ్ రూముల్లో చూశాడు కనిపించ లేదు. ఎక్కడికి వెళ్ళినట్టు....? తనలో తనే ప్రశ్నించుకున్నాడు.

రమాకాంత్ హృదయం బావురుమంది. అతని కళ్ళు ఆర్ద్రమయ్యాయి. సోమసుందరం తననిగురించి ఏమనుకుంటాడోనన్న బాధ అధికమయ్యింది. పాపం, వాడూ యెంత బాధపడివుంటాడో తను కలవనందుకు!....అనుకుంటూ, వికల మనస్కుడై కాళ్ళీడ్చుకుంటూ తిరుగుముఖం పట్టాడు రమా

కాంత్. గేటు దాటి కారు దగ్గరికి వచ్చాడు. అప్రయత్నంగా అతని దృష్టి యెదురుగా వున్న కాఫీహోటలుమీద పడింది. హోటలుముందు నుంచుని, సిగరెట్ ముట్టించుకుంటున్నాడు.

అంతవరకూ రమాకాంత్ కళ్ళల్లో మెదిలిన బాధాశ్రువులు, ఆనందభాష్పా లయ్యాయ్. అతని హృదయం తేలికపడి దూదిపింజలా గాలిలో తేలింది. మొహంలో ఒక విధమైన కాంతి వచ్చింది. ఒక్క వుదుటున అక్కడకు పోయి, స్నేహితుణ్ణి కౌగలించుకున్నాడు.

"నన్ను క్షమించరా సుందరం! అత్యావసరమైన పని మీద పొరుగూరు వెళ్ళవల్సివచ్చి, స్టేషనుకి రాలేకపోయాను. నేను లేకపోవడమే యిన్ని అపశ్రుతులకు కారణభూతమయ్యింది నువ్వు అన్యథా భావించకు.... బాధపడకు. ఇంటికి పద....ఏదీ, ఆ బేగ్ ఇలా యివ్వు" అంటూ బేగ్ తీసుకుని, స్నేహితుణ్ని పొదివి పట్టుకుని, కారు దగ్గరికి తీసుకుపోయాడు.

రమాకాంత్ గురించి, యింతవరకూ మరోలా భావించిన సోమసుందరం తన ఊహను, మనసునుండి అవతలకు నెట్టి వేశాడు.

"పోనీయ్ డ్రైవర్..." ఆజ్ఞాపించాడు రమాకాంత్. కారు, బుర్రుమంటూ సాగిపోయింది.

ఇరువురు స్నేహితులూ కారులోనే యెన్నో విషయాలు మాట్లాడుకున్నారు. నవ్వుకున్నారు. ఆ రోజు వాళ్ళకో పర్వదినం!